క్లుప్తంగా

ఏచూరికి ఘనంగా నివాళి



వత్సవాయి: సీపీఎం పార్టీ అగ్రనేత సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా నాయకుడు చిరుమామిళ్ల హనుమంతు రావు అన్నారు. వత్సవాయిలోని పార్టీ కార్యాలయంలో నాయకులు ఆదివారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిరుమామిళ్ల మాట్లాడుతూ ఉద్యమనేతగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, వర్ధమాన రాజకీయాల్లో ఆదర్శనేతగా సమసమాజస్థాపన కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఏచూరి సీతారం అని కొనియాడారు. నేటి రాజకీయాల్లో అటువంటి నాయకులు ఉండటం అరుదైన అంశమని కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి తమ్మినేని రమేష్, సభ్యులు బి.రాము, పి కోటేశ్వరరావు, గంగుల వెంకటేశ్వర్లు, ఏసుపోగు వెంకటరత్నం, కూరపాటి వెంకటేశ్వర్లు, పెంటి వెంకయ్య, కరిసె రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాగు చప్టా



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లే రోడ్డులో మునేరు అవతల తువ్వకాలువ వాగుపై నిర్మించిన చప్టా అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల సంభవించిన వరదలకు చప్టా మొత్తం కుంగిపోవటంతోపాటు గుంతలు పడ్డాయి. ప్రమాదం చోటుచేసుకోక మునుపే సంబంధిత అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదు పరిశీలన



నందిగామ టౌన్: బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో నిర్వహిస్తున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని నాయకులకు సూచించారు. బీజేపీ నాయకులు మున్నంగి కామేశ్వరరావు, మాదాల రమేష్, కాకాని తరుణ్, పోరుగంటి నరసింహారావు, కేదార్‌నాథ్‌శర్మ, సీతారామయ్య, సాంబ శివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పూర్ణాహుతి



పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద తొమ్మిదోరోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు,ఏఈవో తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

150 మందికి కంటి పరీక్షలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీగోపయ్య సదన్‌లో విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ ప్రారంభించారు. అమరావతి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది భువన్, ప్రియాంక, సతీస్, సంజన, బాలరాజు పాల్గొని 150మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30మందికి కళ్లజోళ్లు అందించారు. మరో 40మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గసభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ పాల్గొన్నారు.


కంచికచర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో పూజలు చేస్తున్న భక్తులు


పేట విశ్వబ్రాహ్మణబజారులో గణనాథుడి ఊరేగింపు


వేదాద్రి వద్ద ఫంటుపైకి విగ్రహాన్ని ఎక్కిస్తున్న భక్తులు


కోదాడరోడ్డులో వినాయకుడికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే తాతయ్య


పేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


జగ్గయ్యపేట పేట మార్కండేయబజారులో భక్తుల కోలాహలం


పేట డాంగేనగర్ నుంచి గణేషుడిని నిమజ్జనానికి తరలిస్తున్న యూత్ సభ్యులు, భక్తులు

వైభవోపేతంగా

వినాయకుడి నిమజ్జనాలు


వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

వినాయకచవితిని పురస్కరించుకుని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. నందిగామ, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, కంచికచర్ల, వత్సవాయి, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు ఆదివారం గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద స్వామివారి లడ్డూ వేలం పాటలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. స్వామివారి లడ్డూలను కైవసం చేసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. గణనాథుడిని ప్రత్యేకంగా అలకంరించిన వాహనంపై ఉంచి ఊరేగించారు. డీజే సౌండ్స్, తీన్‌మార్ డ్యాన్స్‌లతో యువత కేరింతలు కొట్టగా, ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. వేదాద్రిలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో కృష్ణానదిలో, కీసర వద్ద మునేరులో వినాయక నిమజ్జనాలు చేశారు. జైజై గణేశా..బై..బై గణేశా అంటూ భక్తులు నినాదాలు చేశారు. జగ్గయ్యపేటతోపాటు తెలంగాణ, గుంటూరు జిల్లాల నుంచి తరలివచ్చిన వినాయకుడి విగ్రహాలను వేదాద్రి వద్ద కృష్ణానదిలో ఏర్పాటు చేసిన ఫంటు ద్వారా పోలీసు బందోబస్తు నడుమ భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

– జగ్గయ్యపేట, జగ్గయ్యపేటఅర్బన్, నందిగామటౌన్, కంచికచర్ల, వీరులపాడు, పెనుగంచిప్రోలు


పేట ముక్త్యాల రోడ్‌లో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు


పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడులో గణనాథుడి ఊరేగింపు


జగ్గయ్యపేట బ్రాహ్మణబజారులో స్వామివారితో భక్తులు


పెనుగంచిప్రోలులో పూజలు చేస్తున్న భక్తులు


వీరులపాడు: జుజ్జూరు బీసీ కాలనీలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు


నందిగామ మార్కెట్ కమిటీ వద్ద వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


కంచికచర్లలో గణనాథుడికి పూజలు చేస్తున్న సీఐ చవాన్, కమిటీ సభ్యులు


వేదాద్రి వద్ద నిమజ్జనానికి ముందు గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

బాధితులకు దుస్తుల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాలేటి వరద ముంపు బారిన పడిన పట్టణానికి చెందిన పలువురు వరద బాధితులకు స్థానిక అన్నపూర్ణ సేవాసమితి ప్రతినిధి మహంకాళి జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) హాజరై బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నపూర్ణ సేవాసమితి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. పదేళ్లుగా పేదలకు సేవలందిస్తున్న సేవాసమితి ప్రతినిధి జయప్రకాష్, సభ్యులను ఆయన అభినందించారు.


బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జయప్రకాష్, సభ్యులు

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే

రెడ్డినాయక్‌తండా(జగ్గయ్యపేట): వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని రెడ్డినాయక్‌తండాలో వరద ముంపునకు గురైన ప్రాంతాలు, పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తండా నుంచి బూదవాడ వెళ్లే అప్రోచ్‌రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయాయని, పదుల సంఖ్యలో గృహాలు పాక్షింగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యుత్ సరఫరాను పునరుద్దరించాలని ఏఈని ఆదేశించారు. నాయకులు బాబురావు, నరసింహారావు పాల్గొన్నారు.

రూ.2లక్షల విలువగల నిత్యావసరాలు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట వరద బాధితుల సహాయార్థం విసన్నపేటకు చెందిన చాంబర్ ఆఫ్ కామర్స్ వారు రూ.2లక్షల విలువైన నిత్యావసర వస్తువులను ప్రత్యేకవాహనంలో ఆదివారం జగ్గయ్యపేటకు తీసుకువచ్చి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కు అందజేశారు. బాధితులను ఆదుకునేందుకు నిత్యావసరాలు అందజేసిన విసన్నపేట వ్యాపారులకు ఎమ్మెల్యే తాతయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. విసన్నపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కుక్కడపు శ్రీరాంబాబు, కుక్కడపు లడ్డూ, చెరుకు విజయ్, పేట మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, ఉప్పుటూరి రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్‌లో వేంచేసియున్న శ్రీస్వయంభు విఘ్నేశ్వర స్వామివారికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్థానిక షరాబు వర్తకసంఘం వారు నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ లక్ష బిల్వార్చన పూజ చేశారు. వర్తక సంఘం అధ్యక్షుడు శ్రీరాం సుబ్బారావు, గౌరవాధ్యక్షులు శ్రీరాం రామకృష్ణ, కార్యదర్శి కొంకిమళ్ల మల్లికార్జునరావు, కోశాధికారి యర్రం శివ తదితరులు పాల్గొన్నారు.

మునేటి కాలువకు నీటి విడుదల

పోలంపల్లి(వత్సవాయి) :మునేటి కాలువకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆదివారం నీటిని విడుదల చేశారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు పోలంపల్లి వద్ద మునేటిపై ఉన్న చెక్‌డ్యాంకు గండ్లు పడటంతో కాలువకు నీరు ఎక్కకుండా నీరంతా వృథాగా మునేటిలో కలిసిపోయింది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెక్‌డ్యాంకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చే పనులు చేపట్టారు. చెక్‌డ్యాంకు పడిన గండ్లతో పాటు కాలువలో ఉన్న చెత్తను లాకులకు అడ్డుగా ఉన్న దుంగలను తొలగించారు. రైతులు కూడా నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇరిగేషన్ ఏఈ ఆర్. రామనరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

వరద నీటిని తొలగించాలని డిమాండ్


జయంతిపురం ఎస్సీకాలనీలో చేరిన నీటిని పరిశీలిస్తున్న నాయకులు

జయంతిపురం(జగ్గయ్యపేట): మండలంలోని జయంతిపురం ఎస్సీకాలనీలో రెండువారాలుగా నిలిచిన ఉన్న వరదనీటి తొలగింపునకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆదివారం జయంతిపురం గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికీ కూడా 50 గృహాలలో రెండు నుంచి మూడడుగుల నీరు ఉందని, దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇళ్లలోని వరద నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు కోట కృష్ణ, గోపీనాయక్, శేషు, సైదులు తదితరులు పాల్గొన్నారు.